కథా నిలయం
3885
శ్రీకాకుళం

# ప్రైవేటు మాష్టరు

ఆ సాయంత్రం చల్లగాలికి బకింగ్‌హామ్ కెనాల్ వొడ్డున పచ్చటి గరికమీద కూర్చున్నాడు ప్రైవేటుమాష్టరు సూర్యనారాయణమూర్తి. కాలువగట్టున చెట్లనీడలు ప్రాకి అవతలి వొడ్డును తాకినయ్. సూర్యుని కడసారి కిరణాలు ఎర్రగా నీళ్లపై బడి మనోజ్ఞంగా మెరుస్తున్నాయి. పొలాల్లో పనిచేసి వొస్తూన్న ఆడవాళ్ళు కులాసాగా కబుర్లు చెప్పుకుంటో, నవ్వుకుంటో—వానవచ్చి వెలిసినట్టుగా అతని వెనగ్గా నడిచి వెళ్ళారు.

పడమటి దిక్కునుంచి, కరణంగారి అరటితోటలమీదుగా గాలి హాయిగావీస్తోంది. ప్రైవేటుమాష్టరు సూర్యనారాయణమూర్తి ఆలోచిస్తున్నాడు. ఏకాంతంగావుంటే అతనికి ఆలోచించుకోవటమే పెద్ద కాలక్షేపం! ఆలోచించుకోవటంలో ఉన్న ఆనందం, సంతృప్తి—అలవాటుపడినవాళ్ళకుగానీ తెలీదు.

"బాబుగారూ...!" మార్దవం, మాధుర్యంవొలికే కంఠ ధ్వని వినవొచ్చింది.

ఆలోచనలగొలుసు ఆ స్త్రీ కంఠంలోని శ్రావ్యతకు పుటుక్కున తెగింది. సూర్యనారాయణమూర్తి మెడ ప్రక్కగా తిప్పిచూచాడు.

ఆమె ఎంతో వినయంగా నమస్కరించింది. ప్రతిగా నమస్కరిస్తూన్నట్టు తల ఆడించాడు సూర్యనారాయణ మూర్తి. ఆమె మాట్లాడేందుకు సిగ్గుపడుతూన్నట్టు, సంకోచిస్తూ న్నట్టు – అతనివంక అదోరకంగా చూస్తూ కొంచెం విలంబనం చేసింది. అతను ఆమెవంక ఆశ్చర్యపడుతూ అదేపనిగా చూశాడు రెండుమూడు నిముషాలు. మనిషి పెద్ద రూపవతి కాదు. ప్రథమవీక్షణంలోనే ఆకర్షించే అందమైన లక్షణాలు ఆమెలో అట్టేలేవు. కాస్త నిదానించి చూచినమీదటగాని అతనికి ఆమె అందం అంతుపట్టలేదు. చామనచాయ; గుండ్రటి ముఖం; వొంకులజుత్తు; నిండుగా కనిపించే ముక్కు; పల్చటి పెదాలు; వయస్సును నిర్ణయించలేని వక్షాలు; కళ్ళల్లో ప్రత్యేకం మగవాడు మోజుపడే ఆకర్షణ. 'ఆమె అందం ఫర్వాలేదు' అని సమాధానపర్చేవి ఆకళ్ళే! కాని మొట్ట మొదట మనిషిని చూడగానే కనిపెట్టవచ్చు–జీవితంలో ఎన్నో అనుభవాల్ని మూటకట్టుకున్నదని. సూర్యనారాయణమూర్తి కూడా అదే అభిప్రాయానికి గురియైనాడు.

"నాపేరు రాజ్యలక్ష్మి. నేను..." ఉపోద్ఘాతంలేకుండా తన కథను మొదలెట్టిన ఆమెను – "కూర్చోండి! తర్వాత

మాట్లాడుదురుగాని” అన్నాడు సూర్యనారాయణమూర్తి మర్యాదగా. అతని మర్యాద ఆమెకెంతో గుండెధైర్యాన్ని తెచ్చిపెట్టింది.

సావకాశంగా తన దీనచరిత్రను వినిపించింది. సహనంతో అంతా విన్నాడు సూర్యనారాయణమూర్తి. కనుచీకటిపడింది.

ఆమెది వాస్తవానికి విషాదగాథే. కాని అది అతి సామాన్యమైనదే! లోకంలో అట్లాంటివి చాలా జరిగాయి, జరుగుతున్నాయి—జరగొచ్చుకూడా. ఆమె నిరుపేదకుటుంబానికి చెందినది. చిన్నతనంలోనే తల్లీ - తండ్రీ చనిపోయారు; మేనమామ పెంచి పెద్దదాన్ని చేశాడు. ఆమె ఫోర్తుఫారం వరకూ చదువుకుంది. మేనమామ ఒక పేదవాడికిచ్చి పెళ్ళిచేశాడు. మూడేళ్ళు ముచ్చటగా కాపురంచేసి, టైఫాయిడ్ జ్వరంతో ఒక దుర్ముహూర్తాన యీ లోకాన్ని విడిచాడు. తర్వాత కథ ఏముంది? మేనమామ “ఇక నీ బ్రతుకు నీవు చూసుకోవమ్మా!” అన్నాడట. గతిలేక లోకంమీదపడింది. భర్త స్వగ్రామంలో వుండే తావులేక, వయస్సులోవున్న మగవాళ్ళు ఎగబడితే—అవినీతికి తెగబడలేక పారిపోయి వచ్చిందట నీతిగా జీవనం గడుపుకుందామని.

‘ఆమె తన జీవితచరిత్ర నిజంగానే వెల్లడించిందా! కట్టుకథ అల్లిందా? ఆమె నిజంగానే మొగుడుచచ్చిన దిక్కు-మాలిన స్త్రీయా? లేక మొగుడు విడిచిపెట్టిన నీతిమాలిన స్త్రీయా? ఆమె జీవితం చాలా రుచిచూచిన ఆడదిలాగా అగపడుతుందే! వాస్తవంగా ఆమె అవినీతికి భయపడే

వొచ్చిందా ?—' అట్లా ఆలోచించలేదు సూర్యనారాయణ మూర్తి. ఆమెను చూడటంతో ఒకవిధమైన కరుణ ఏర్పడింది హృదయంలో. అసలే అతను మెత్తని మనస్సు గలవాడు. సినిమాలలో పాత్రలుపడే కష్టాలకే కళ్ళనీళ్ళు కారుస్తాడు. చూస్తూ ఏ అన్యాయాన్నీ సహించలేడు. ఏ అక్రమాన్నీ దిగమ్రింగలేడు; ఏ అవినీతినీ క్షమించలేడు.

"ఈఊళ్ళో నాకేదైనా జీవనాధారం దొరుకుతుందా?" అన్నది ఆఖరికి రాజ్యలక్ష్మి.

చిన్నగా నవ్వాడు సూర్యనారాయణమూర్తి.

"కష్టించి పనిచేసేవాళ్ళకు ఒక ఊళ్ళోమటుకు జీవనాధారం దొరకదా ?" అన్నాడు అతను సామాన్యధోరణిలో.

చీకటి బాగా దిగజారాక తనవెంట ఊళ్ళోకి తీసుకొచ్చాడుఆమెను. సూర్యనారాయణమూర్తి ఏకాకి. భార్య చనిపోయి దాదాపు పదేళ్ళు కావస్తున్నది. భార్యవున్న రోజుల్లో ఉన్న రెండెకరాల మాగాణిఅమ్మి, విరివిగా ఖర్చుపెట్టి ఆమె చనిపోయేటప్పటికి చిల్లి కానీ మిగల్చలేదు. అంత జల్సాగా గడిపిన జన్మస్థానంలో బిచ్చగాడిలా బ్రతకలేక ఆ ఊరు వచ్చాడు మూడేళ్ళక్రితం పిల్లలకు ప్రైవేటు చెప్పుకుని బ్రతుకుదామని. ఆ ఊళ్ళోవున్న ఎలిమెంటరీ స్కూల్లో పంతుళ్ళు ఏమీ చదువు చెప్పకపోవటంచేత - సూర్యనారాయణమూర్తి ప్రైవేటు స్కూల్లో వేలంవెర్రిగా పిల్లలు జేరారు. బాగా చదువుచెప్పే మాష్టరని ఊళ్లో పేరుపడింది. అంచాత రానురాను అతని స్కూలే ఎలిమెంటరీస్కూలైంది.

చీకట్లో రాజ్యలక్ష్మిని ప్రైవేటు మాష్టరు సూర్య నారాయణమూర్తి వెంట బెట్టుకొని రావటం ఆ ఊళ్ళో చాలమంది చూశారు. ఎవ్వరూ ఎందుచేతనో అపోహపడ లేదు. కాని ఆ ఊరి పంచాయితీబోర్డు వైస్ ప్రెసిడెంటు బాపినీడు ఆమెను చలమయ్య కిళ్ళీకొట్టు పెట్రోమాక్సులైటు కాంతిలో చూసి – "ఎక్కడిదిరా ఈ పిట్ట," అన్నాడు నిర్ల క్ష్యంగా. కాని ఆ మాటల్ని ఆమెకానీ, మాష్టరుకానీ విన లేదు.

ఆమె 'వంటచేస్తా'నని అన్నది కానీ సూర్యనారాయణ మూర్తి ఆమెని చేయనివ్వలేదు. స్వయంపాకం ఆమెకి రుచి చూపించి ఆమె మెప్పుపొంది మురిసిపోయాడు.

ఆ రాత్రి నిద్రబోయేముందు ఒక ఆలోచన తట్టింది సూర్యనారాయణమూర్తికి. 'ఆ ఊళ్లో ఆమెకు గౌరవప్రద మైన జీవనాధారం ఏం దొరుకుతుంది? తన స్కూలు వర్ధ మానదశలో వుంది. ఇప్పటికే ముప్ఫైమంది వున్నారు. రాజ్య లక్ష్మిని పంతులమ్మగా యిక్కడే వుండిపొమ్మంటే – తను ఇంకా పిల్లల్ని జేర్చుకొనేందుకు అవకాశం వుంటుంది. ఎంతో మంది తండ్రులు రోజూ తిరిగిపోతూనే ఉన్నారు తమ పిల్లల్ని జేర్చుకోమంటూ. ఆమెకూ తను కొంత జీవనాధారం సునా యాసంగా కల్పించినట్లూ వుంటుంది. అసలు ఆమె ఏమం టుందో – ఈ ఆలోచనకు.'

*

# 2

జీవితంలో కొన్ని కొన్ని సంఘటనలు ఎంతో విచిత్రంగా, ఆకస్మికంగా, ఆశ్చర్యజనకంగా జరుగుతూవుంటాయి. కొన్ని జీవితంలో మంచికి దారితీయవచ్చు; మరికొన్ని చెడుకు దారితీయవచ్చు; ఇంకా కొన్ని జీవితపథాన్నే అనుకోనిరీతిగా మార్చవచ్చు. సూర్యనారాయణ మూర్తితో ఆ సాయంత్రం తలవనితలంపుగా పరిచయం కలగడం జీవితంలో ఒక మరపురాని సంఘటనగా గుర్తించింది రాజ్యలక్ష్మి. ఆమరుసటిరోజు ఉదయం–"మీరు ముక్కూ మొహం తెలీని యీ ఊళ్లో ఏం జీవికచూసుకుంటారు! రాత్రి నాకు ఒకఆలోచనతట్టింది. మీకు నచ్చి, ఆ విధంగా ఒప్పుకుంటే–నాకు అభ్యంతరం ఏమీలేదు. ఇక్కడ ఎలిమెంటరీ స్కూల్లో పంతుళ్లకు చదువు చెప్పడం మీద ఉన్న అశ్రద్ధవల్ల ప్రైవేటు స్కూలు ఆవశ్యకత జాస్తిగాఉంది. ప్రతి తండ్రి ప్రైవేటు చెప్పించడంద్వారా పిల్లవాడి అభివృద్ధిని ఆకాంక్షించడం సహజం. నా ప్రైవేటు స్కూల్లో మీరు బాలికల సెక్షను నిర్వహిస్తే - మీకు శ్రేయస్కరమైన జీవనాధారం ఏర్పడుతుంది" అని సూర్యనారాయణమూర్తి అన్నప్పుడు, ఆ సంఘటన తన జీవితంలో 'మంచి'కే దారితీసిందని రాజ్యలక్ష్మి గాఢంగా నమ్మింది.

ఆనందంతో ఆమె కళ్ళు మెరిశాయి; మనస్సు ఎగిరిగంతేసింది; హృదయం సముద్రం ఉప్పొంగినట్టు ఉప్పొంగింది–

"మీరు ఇంత సహృదయులని..." ఆపైన కృతజ్ఞతని మాటలద్వారా వెల్లడించలేకపోయింది రాజ్యలక్ష్మి. ఆమె

ముఖంలోని సహజమైన ఆవేశాన్ని అతను గ్రహించి— సంతోషపడ్డాడు.

సూర్యనారాయణమూర్తి ఉండే ఇల్లు రెండు కుటుంబాలు దివ్యంగా ఉండేందుకు సరిపడే ఇల్లు. పల్లెటూరు కనుక, అద్దెకుండే వాళ్ళ వొత్తిడి అసలే లేదు కనుక — పది రూపాయలకే ఆ ఇంటి యజమాని అద్దెకిచ్చి, తన కొడుకు డివిజనల్ ఇంజనీరైతే వార్ధక్యదశలో అక్కడే స్థిరపడ్డాడు. సువిశాలమైన గృహం కనుక రాజ్యలక్ష్మిని వేరే పెట్టేందుకు ఎక్కువ శ్రమ లేక పోయింది అతనికి. రెండు పెద్దతడికెలు మేదరవాళ్ళ చేత అల్లించి అడ్డంగా పెట్టాడు. రాజ్యలక్ష్మి ఉండేందుకు, పిల్లలకు చదువుచెప్పేందుకు విడిగా గదులుగా ఏర్పాటుచేశాడు. ఆమె వంటచేసుకొనేందుకుకూడా ప్రత్యేకంగా పొయ్యి పెట్టించాడు.

ఆ ఊళ్ళో రాజ్యలక్ష్మిని గురించి అనేక రకాలుగా చెప్పుకో నారంభించారు. 'ఆమెకూ పంతులుగారికీ అంతకు ముందు ఎక్కడో సంబంధం ఉందట.' 'ఆమె మొగుడు విడిచి పెట్టిన దిక్కుమాలినదట. మనిషి అందంగావుంటే-భార్యలేని లోపాన్ని తీర్చుకోవటానికి తీసికొచ్చాడట.' 'ఆమెకు మొగుడు లేడూ, ముక్కు చెక్కులూ లేవు.' 'అసలు పెళ్ళే కాకుండా సంతానవతి అయిందట. పుట్టిన పాపని ఏ కాలవలోనో పార వేసి-పంతులుగారి పంచన చేరిందట !–' ఆ విధంగా ఆ ఊళ్ళో వాళ్ళు చెప్పుకోవటం అతనికి తెలిసింది. కాని ఏమంటాడు? కొత్తగా ఊళ్ళోకి వొచ్చిన వాళ్ళమీద స్వేచ్ఛగా ఊహా గానాల్ని చేయడం-పల్లెటూరి వాళ్ళకు ఉగ్గుపాలతో వొచ్చిన

విద్య. తన మీాద చెలరేగిన దుమారాన్ని అరికట్టేందుకు, అపోహల్ని ఖండించేందుకు సూర్యనారాయణమూర్తి ప్రయత్నించలేదు. అడిగిన వాళ్ళకు నిజం చెప్పాడు.

సూర్యనారాయణ ప్రైవేటు స్కూల్లో వారం రోజుల్లో అదనంగా అయిదుగురు బాలికలు, పదిమంది బాలురూ చేరారు. వాళ్ళను అతను రాజ్యలక్ష్మివల్లనే చేర్చుకున్నాడు. ఆమె పిల్లలకు సక్రమంగా, శ్రద్ధగానే పాఠాలు చెబుతూంది. అంతకు పూర్వం అనుభవం లేకపోయినప్పటికీ, అక్షరాలు వొచ్చిన వాళ్ళకూ, రాని వాళ్ళకూ సహనంతో చదువు చెప్పడం, దిద్దించడం, చూచివ్రాత వ్రాయించటం, 'హోం వర్కు' చేయించటం - రాజ్యలక్ష్మి త్వరలోనే ప్రైవేటు మాష్టరుగారికి విశ్వాసాన్ని కలిగించింది. ఆమె ఎంత మంది పిల్లలకు ప్రైవేటు చెబుతూందో - ఆ జీతమంతా ఆమెకే చెందేట్టుగా ఏర్పాటుచేశాడు.

రోజులు బాగానే గడుస్తున్నాయి. కాని రాజ్యలక్ష్మికి తనకు యింత ఆదరణ యిచ్చి, గౌరవప్రదమైన జీవికను కల్పించిన సూర్యనారాయణమూర్తి స్వయంపాకంతో బాధపడటం నచ్చలేదు. 'తనుస్త్రీ మైవుండీ కూడా అతనిని చేయికాల్చుకోనివ్వడం మర్యాదా? అతను తనకుచేసిన సహాయానికి, చూపిన ఔదార్యానికి తను ఇట్లానేనా కృతజ్ఞత ప్రకటించటం? నలుగురూ ఏమనుకుంటారు?' అట్లా బాధపడింది రాజ్యలక్ష్మి. కాని వెంటనే చొరవచేసికొని తన అభిప్రాయాన్ని వెల్లడించలేకపోయింది. అన్యథా భావిస్తాడేమో నన్న భయం ఆమెను పీకింది.

ఒకరోజు సాయంత్రం బడి వదలిపెట్టాక తెగించింది——

"ఏమండీ! మిమ్మల్ని ఒక్క విషయం అడగాలని కుతూహల పడుతున్నాను."

సూర్యనారాయణమూర్తి హృదయం ఎందుకో గతుక్కుమన్నది-ఆమె అంతగా అడగాలని కుతూహలపడే ఆ విషయం ఏమైవుంటుందోనని.

"అడగండి——"

"ఏంలేదు; ఈ ఇంట్లో నేను అడుగు పెట్టినప్పట్నుంచీ నన్ను ఒక్క విషయం బాధిస్తోందండీ. తమరు కాస్త దయదలిస్తే ... నా ఆత్మకు కొంత ఉపశాంతి..."

ఆమె మాటలు సుతరామూ అర్థం కాలేదు ప్రైవేటు మాష్టరుకు. అయినా తల ఆడించాడు.

"ఏమీలేదు తమరు నేను వొచ్చాకకూడా స్వయంగా వంట చేసికోవడం——" నీళ్ళు నమిలింది రాజ్యలక్ష్మి.

ఆమె ముఖకవళికల్లోని భావపటిమను అర్థం చేసుకున్నాడు; ఎంతో ఆనందపడ్డాడు. కాని క్షణికమైన ఆ ఆనందానికి ఆత్మను లొంగనివ్వలేదు.

"అహఁ! అట్లా వీలుపడదండి. స్వయంపాకానికి నా చేతులు యిన్ని సంవత్సరాలనుంచీ బాగా అలవాటు పడ్డాయి. మీరు నాకు వంటచేసి పెట్టడం - నా ఆత్మకు సంతృప్తి చేకూర్చదు. ఆత్మసంతృప్తి లేనిది నేను ఏ పనీ చేయను; చేయనివ్వను. దయచేసి మీ మాటను త్రోసి

పుచ్చినందుకు క్షమించండి” అన్నాడు సూర్యనారాయణ మూర్తి.

నిర్విణ్ణురాలైంది రాజ్యలక్ష్మి.

ఆమె ముఖంలో తన నిరాకరణవల్ల కలిగిన మార్పు కొంచం బాధ కలిగించింది సూర్యనారాయణమూర్తికి.

ఆ రాత్రి చాలసేపు ఆలోచించాడు సూర్యనారాయణ మూర్తి – ఆమెను గురించే. భార్య గతించిన దగ్గర్నుంచీ స్త్రీతో మాట్లాడడంగానీ, స్త్రీ సాంగత్యానికి ప్రాకులాడడం గానీ లేదు. తన గతచరిత్ర సింహావలోకనానికి తెచ్చుకుని, అందులోని కుళ్ళునూ, అవినీతినీ, దుర్మార్గాన్నీ అవగాహన చేసుకొని – చెంపలేసుకోవడంతోనే సరిపోయింది. జీవితం కొంత ముందుకు సాగింతర్వాతనే – మానవుడు వెనక్కు మళ్లి ఏం జరిగిందో చూసుకోగలడు. రోజులు హాయిగా గడుస్తూంటే, సుఖం మానవుడి ఆత్మను పెనవేసికొని – వెనక్కు మళ్ళనివ్వదు. ఉన్నది కాస్తా తగలేసుకొని, లోకంలో ఉన్న సుఖంలో మునిగి తేలుదామనుకొన్న రోజుల్లో – అతని ఆత్మకు వెనుకచూపు లేదు. కాని జీవితంలో ఆ మాయకాలం గడిచిపోగానే – సూర్యనారాయణ మూర్తికి ఏది మంచో – చెడో తెలిసికోవాలనే జ్ఞానతృష్ణ సహజంగా కలిగింది. అయినా అతను సన్యాసం పుచ్చుకోలేదు; ‘ఈ జగత్తంతా మిథ్య – ఈ శరీరమంతా తోలుతిత్తి’ అని భావించలేదు. భౌతికమైన సుఖంమీద అతనికి నమ్మకం ఉంది. కాని గౌరవప్రదంగా సంఘంలో బ్రతికి, స్వశక్తిమీద

జీవితాన్ని ముందుకు నెట్టాలనే ఆశయాన్ని హృదయంలో ప్రతిష్ఠించుకున్నాక - అతని ప్రవర్తనలో చాల మార్పు వొచ్చింది.

అతని ఇంట్లో రాజ్యలక్ష్మి అడుగుపెట్టిన దగ్గర్నుంచీ- ఊళ్ళోవాళ్ళ ఊహల్ని అటుంచి, అతని హృదయంలో కూడా చిన్నగా సంఘర్షణ బయలుదేరిందనే చెప్పొచ్చు. మధ్య వయస్కుడు కావటం చాతనైతేనేమి, కోర్కెల్ని సంపూర్ణంగా విసర్జించినవాడు కాకపోవటంవల్లనైతేనేమి, ఒకస్త్రీని ప్రేమించే అవకాశం అయాచితంగా ఏర్పడటంవల్లనైతేనేమి- సూర్యనారాయణమూర్తిలో అజ్ఞాతంగా ఆమె సౌందర్యాన్ని గుర్తించాల్సిన అగత్యం, ఆమె హృదయాన్ని అర్థంచేసికోవాల్సిన కుతూహలమూ, ఆమెను గంటగంటకూ చూడాలనే ఆసక్తి క్రమంగా ఒక రూపానికి రాసాగినయ్. ఆ రాత్రంతా కంటిమీద కునుకులేకుండా ఆలోచించి, ఆమె చేష్టల నన్నింటినీ - చిరునవ్వునూ, ప్రదర్శించే వినయాన్నీ, ముక్తసరిమాటలనూ, కనపర్చే కృతజ్ఞతా పూర్వకమైన భక్తినీ, మననం చేసికొని, తర్కించుకొని - ఒక నిశ్చయానికి వొచ్చాడు. 'ఆమెకు తనంటె ఇష్టం! కాని తన నిశ్చయంమీద పూర్తి విశ్వాసంలేదు సూర్యనారాయణ మూర్తికి. ఆమెకు తన మీద ఇష్టమని ఎట్లా తెలిసికోవడం! "మీరంటే నాకెంతో ఇష్టం! మిమ్మల్ని మనసారా ప్రేమిస్తున్నాను" అని ఆమె అంటేగానీ నమ్మకం కుదరదు. అట్లా ఆమె సాహసిస్తుందా? ఏదైనా చిన్న సంఘటన వల్లనైనా - తాము ప్రేమికులం

అన్న విషయం బయటపడితే బాగుండును,' అనుకున్నాడు సూర్యనారాయణమూర్తి ఆ తెల్లవారుఝామున.

ఆ శుభముహూర్తంకోసమే అతను ఎదురుచూస్తున్నాడు.

## 3

బకింగ్‌హామ్ కెనాల్‌కు షికారుకెళ్ళి సూర్యనారాయణమూర్తి ఇంటికి వొచ్చేప్పటికి కనుచీకటి కాస్తా కటికచీకటైంది. ఏదో ఆలోచిస్తూ అంత ఆలస్యం చేశాడు. "ఇంత ఆలస్యంగా ఇంటికొచ్చారు. ఇంకా వంటచేసికొని ఎప్పుడు భోజనం చేస్తారు ? ఈ పూటకు మా ఇంట్లోనే భోజనం చేయండి!" అని రాజ్యలక్ష్మి అంటే "అల్లాగే" అందామనుకున్నాడు. అట్లాజరగొచ్చునని అనుకుంటూనే సూర్యనారాయణమూర్తి బజారువాకిట్లో అడుగుపెట్టాడు.

ఇంటిముందు వాకిట్లో రాజ్యలక్ష్మి ఎవ్వరితోనో మాట్లాడుతూంది. సూర్యనారాయణమూర్తికి ఆశ్చర్యం వేసింది. దూరంగా ఉండటం చేత, చీకటివల్ల ఆ వ్యక్తిని పోల్చుకోలేకపోయాడు. సంకోచిస్తూనే మెల్లగా వెళ్ళాడు.

వాళ్ళు ఏం మాట్లాడుకుంటూన్నట్లు లేదు.

ఆ వ్యక్తి గాబరాపడినట్టుగా ఉలిక్కిపడ్డాడు.

"మాష్టరుగారు వొచ్చారు—" అన్నది రాజ్యలక్ష్మి నిశ్చలంగా.

"ఆఁ! ... వొచ్చారా! ... నేనండీ!" అంటూ మాష్టరుగారివైపు తిరిగాడు చీకట్లో ఆ వ్యక్తి. ఇంట్లోని లాంతరుకాంతి బయట నిలబడ్డ వ్యక్తులమీద ప్రసరించటం లేదు. ఆ గొంతునుబట్టి ఆ వొచ్చిన వ్యక్తి ఎవరైందీ గ్రహించాడు సూర్యనారాయణమూర్తి. ఎందుకో ముఖం చిట్లించుకున్నాడు చీకట్లో.

"బాపినీడుగారూ...!"

"అవునండీ! తమకోసమే వొచ్చాను ... మా పెదనాన్నగారి అబ్బాయికి ... తమరు...ప్రైవేటు చెప్పాలండీ! అందుకోసమే ... తమతో మాట్లాడదామని వొచ్చాను. ప్రొద్దుటనించీ ... తీరిందికాదు. ఇవాళ పంచాయితీబోర్డు ఆఫీసులో మీటింగులెండి." బాపినీడు అంత తడబడుతూ ఎందుకు మాట్లాడాలో పంతులుగారికి అర్థంకాలేదు. అతను తను లేనిసమయంలో తనకోసం కోరి వొచ్చినట్టుగానే తోచింది.

"సరే! అల్లాగేలెండి" సూర్యనారాయణమూర్తి విసవిస ఇంట్లోకి నడిచివెళ్ళాడు.

ఆ ఊరి పంచాయితీబోర్డు వైస్ప్రెసిడెంటు బాపినీడు చీకట్లో రాజ్యలక్ష్మివంక చూస్తూ చూస్తూ బజారువాకిలి ఎక్కాడు.

సూర్యనారాయణమూర్తికి ఎందుకో ఇంట్లోకి వెళ్ళగానే స్వేదం వొంటినిండా కమ్ముకుంది. బాపినీడుని చూచి

నప్పట్నుంచీ— తెలియని అశాంతి అతనిలో బయలుదేరింది. 'అతను ఆవేళప్పుడు, తనులేని సమయంచూసి ఎందుకు తన ఇంటికి రావాలి? పిల్లవాడి ప్రైవేటు విషయమైతే రేపు రావొచ్చునుగదా! అతను తన గడపలో అడుగు పెట్టడంలో ఏదో అంతర్యం ఉంది. తను వొచ్చేముందు ... రాజ్యలక్ష్మితో ఏమైన మాట్లాడాడా! అతనువొచ్చి ఎంతసేపైంది? అతను తన ఇంట్లో అడుగు పెట్టడం ఎవరైనా చూశారేమో!...ఎంత అప్రతిష్ట ?'

సూర్యనారాయణమూర్తి అనాలోచితంగా వంట సామగ్రి దగ్గరకు వెళ్ళాడు వంటచేసుకొనేందుకు. అరసోలెడు బియ్యం గిన్నెలో పోశాడు. పొయ్యిలో పేళ్ళూ, పిడకలూ అమర్చి కిరసనాయిల్ పోశాడు కొద్దిగా, త్వరగా రాజుకొనేందుకు. సరీగ్గా అదేసమయంలో రాజ్యలక్ష్మి వొచ్చింది.

"అప్పుడే పొయ్యి వెలిగించారా!...ఆర్పివేయండి. ఇప్పుడు ఇంత పొద్దుపోయి వంటచేసుకుంటారా? ఇంకా నయం. ఇవాళ మా ఇంట్లో భోంచేయవలసిందే—"అన్నది రాజ్యలక్ష్మి పొయ్యిదగ్గరకు వస్తూ.

వినిపించుకోకుండా సూర్యనారాయణమూర్తి గిన్నెలో నీళ్ళుపోసి పొయ్యిమీద పెట్టబోయాడు. రాజ్యలక్ష్మి అతని చేతుల్ని మృదువుగా తాకి - అతని కళ్ళల్లోకి మోహముగా చూసింది. అప్రయత్నంగా అతనివ్రేళ్ళు పట్టుదప్పిపోయినాయి. అతని చూపులు హఠాత్తుగా చల్లబడ్డాయి. బియ్యపు గిన్నెను క్రిందబెట్టి, పొయ్యిలో నీళ్ళు పోసింది రాజ్యలక్ష్మి. పొయ్యి

చల్లారింది; సూర్యనారాయణమూర్తి హృదయం కూడా చల్లారింది.

*

'తాను ఎదురుచూస్తున్న ముహూర్తం ఆ రాత్రి ఆమె భోజనానికి ఆహ్వానించడంతో వొచ్చిందని' అనుకున్నాడు గానీ-సూర్యనారాయణమూర్తి ఆ రాత్రి ఆశించినంత అనుభూతిని పొందలేదు. మనస్సంతా చీకాగ్గా వుండంవల్ల-ఆమె ఆప్యాయంగా, అభిమానంగా అన్నమూ, కూరలు వడ్డించి, అన్నం తిన్నంతసేపూ దగ్గరకూర్చున్నా, నల్లద్దాలజోడు పెట్టుకొన్నవాడిలా ప్రవర్తించాడు. ఆమె హృదయపు లోతుల్ని అర్థం చేసుకోలేకపోయాడు; ఆమె చూపుల భావాన్ని, గ్రహింపలేకపోయాడు. ఆమె చేష్టల పరిభాషను అవగాహన చేసుకోలేకపోయాడు.

మరునాడు బాపినీడు తన పెదనాన్నగారి కుమారుణ్ణి ప్రైవేటు స్కూలుకు పంపించలేదు. అసలు అతని పెదనాన్నకు ప్రైవేటు స్కూల్లోచేరే కొమారుడు ఉన్నాడో, లేడో కూడా తెలియదు.

సూర్యనారాయణమూర్తి హృదయంలోని కల్లోలం తగ్గలేదు. ఆరాత్రే 'మీతో బాపినీడుగారు ఏంమాట్లాడారు?' అని ఆమెను అడుగుదామనుకున్నాడు గానీ - తనకి ఆ ఆ అధికారంలేదన్నట్టు 'ఛీ' లయ్యాడు. ఆరోజు అతను పిల్లలకు పాఠాలు సక్రమంగా చెప్పలేకపోయాడు. జవాబు చెప్పలేని

ఇద్దరు ముగ్గురు పిల్లల్ని – విసుక్కుని కొట్టాడు. తరువాత అనవసరంగా కొట్టానని పశ్చాత్తాప పడ్డాడు.

ఆరోజు సాయంత్రం బడి వొదిలిపెట్టగానే సూర్య నారాయణమూర్తి మామూలుగా బకింగ్‌హామ్ కెనాల్‌కు వెళ్ళేందుకు బయల్దేరాడు. కాని ఆరోజు కొంచెం ఆలస్యం జరిగింది–వెళదామా, ఒద్దా అని మధనపడేప్పటికి. అతను బయలుదేరేటప్పుడు రాజ్యలక్ష్మి ఇల్లు వూడుస్తోంది. అతను అట్లా బజారువాకిలి దాటాడో లేదో, బాపినీడుగారి జీతగాడు చిన్న సంచీతో ఇంట్లోకి వెళ్ళాడు. సూర్యనారాయణమూర్తి గుండె వొణికింది. అడుగు ముందుకు పడలేదు. 'ఆ సంచిలో ఏమున్నాయి? చీరెలా, జాకెట్లా, డబ్బా, మరి ఇంకేమైనానా ? ...బాపినీడే పంపాడా ? ఎందుకు ? వెనక్కి మళ్ళి ఇంట్లోకి వెళదామా ?' అనిపించింది సూర్యనారాయణమూర్తికి. కాని ఆత్మ అంగీకరించలేదు. కాళ్ళీడ్చుకుంటూ కాలవకట్టఎక్కాడు తీరిగ్గా ఆలోచించుకోవటానికి.

బాగా పొద్దుపోయింది సూర్యనారాయణమూర్తి ఇంటికి తిరిగి వొచ్చేటప్పటికి. రాజ్యలక్ష్మి లైటు బయట పెట్టుకుని పేపరు చదువుకుంటోంది. ఆమెదగ్గరకు రాగానే సువాసన 'గుప్'న కొట్టింది. 'ఈనేగా పరిమళమా ? మనో రంజనియా? ఈవెనింగ్ ఇన్ ప్యారిసా ?' కొత్తచీరె ధరించింది. మైసూరు సిల్కుచీరె. తలలో మల్లెపూలు! — 'ఈ అలంకర ణంతా బాపినీడు చేయించిందే! ఎవరికోసం ? ఎందుకు ?'

—ఇంటిగడప ఎక్కుతూ తూలిపడబోయాడు సూర్య నారాయణమూర్తి. క్షణాలమీద కోపం శరీరాన్నంతటినీ ప్రాకింది. ఇంట్లోకి వెళ్ళగానే మంచంమీద కూలబడ్డాడు. వంటప్రయత్నంలేదు. ఆకలిగాలేదు.

అరగంటతర్వాత రాజ్యలక్ష్మి అతని గదిలోకి వొచ్చింది. 'వంట చేసుకోకుండా పడుకుంటే ఏమైనా తలనొప్పి కామోసు' అనుకున్నది.

"తలనొప్పిగా వున్నదాండీ ?" అన్నది రాజ్యలక్ష్మి. ఆమె దగ్గరగావొచ్చి నిలబడింది.

ఆ సువాసనలేదు, ఆ చీరె తళుకులేదు.

సూర్యనారాయణమూర్తి దిగ్భ్రాంతిచెందాడు. 'తను వస్తూవస్తూ చూచింది ఆమెనుకాదా ? కలేమైనా కన్నాడా ? ఆ అలంకరణా, అందం, ఠీవి—ఇప్పుడు లేవే ! తన గదిలోకి వస్తూ—మామూలువేషం వేసిందా ? ఆ కొత్తచీరెలో, సువాసనలో, సౌందర్యంలో — తను ఆమెను చూడరాదా ? ఆ అందమూ, అలంకరణా, అనురాగమూ, అభిమానమూ—బాపినీడుకోసమా ?'

దిండుమీద తల నిర్లక్ష్యంగా వ్రేళ్ళాడవేశాడు.

"తల నొప్పిగా ఉన్నదా ?" అంటూ రాజ్యలక్ష్మి తలగడప్రక్కన కూర్చొని అతని నుదురుమీద మెత్తగా చేయివేసింది.

ఆమె చేతిని కర్కశంగా తొలగించాడు అతను. ముఖం త్రిప్పి పడుకున్నాడు. అతనికి కోపం వచ్చినట్టు గ్రహించింది. కాని ఆ కోపానికి కారణం ఏమిటో ఆమెకు అర్థం కాలేదు. అమృతాంజనం తెచ్చి అతని నుదురుకు వ్రాసేందుకు ప్రయత్నించింది కానీ అతను "అక్కర్లేదు" అని గర్జించాడు. ఆమె మారు మాట్లాడకుండా తన ఇంట్లోకి వెళ్ళింది. సూర్యనారాయణమూర్తి దిండుమీద మూగగా కన్నీళ్ళు కార్చాడు.

ఎప్పుడు కునుకుపట్టిందో ఎప్పుడు మెలకువ వచ్చిందో తెలీదు సూర్యనారాయణమూర్తికి. మెలకువ వచ్చేటప్పటికి నడిఝామై వుంటుందనుకున్నాడు. బద్ధకంగా లేచాడు. ఆకలైనట్టుగా వుంది. ఆ వేళప్పుడు వంట ఎలా చేసుకోవడం? ఏమీ తోచక, తలుపు తెరచుకొని బయటికొచ్చాడు.

నిర్ఘాంతపోయాడు ఆ నిద్రమత్తులోనే ఆ దృశ్యం చూసి. బాపినీడు గబగబా ఆమె ఇంట్లో ప్రవేశించాడు. ఆమె తలుపు తెరచే వుంచినట్టుంది. గట్టు లేని ప్రవాహంలాగ— లోపల జొరబడ్డాడు. కొలది క్షణాల్లోనే తలుపులు మూసుకోవడం గూడా చెవులారా విన్నాడు.

అతని తల దిమ్మెత్తిపోయింది. వొళ్ళంతా పామును చలిచీమలు పీకుతున్నట్టుగా వుంది.

'పరిస్థితులు ఎంత త్వరగా విషమించాయి. 'కనకపు సింహాసనమున...' అన్నట్టు తాను ఎడారిలోపడ్డ ఆమె జీవితానికి నీటివసతి కల్పిస్తే - ఆ నీరును పాడుచేసింది. ఎండి మోడైన ఆమె జీవితానికి ఆకుల్ని చిగిరింపజేస్తే-ఆ ఆకుల్ని

రాల్చుకొనేందుకు ప్రయత్నిస్తోంది. తను చేసిన సహాయం, చూపిన అభిమానం, ఆదరణ - అంతా దుర్వినియోగపరుస్తోంది. ఆమె జీవితానికి గౌరవప్రదమైన బ్రతుకు తెరువును కల్పిస్తే - తప్పుదారిలో నీచంగా, అవినీతిగా బ్రతకాలని చూస్తోంది! ఆమె జీవిత దృక్పథమే అంతేనేమో...తను పొరపాటుబడ్డాడు ఆమె విషయంలో. రాజ్యలక్ష్మి నిజాయితీపరురా లనుకున్నాడు. హృదయంకల వ్యక్తి అనుకున్నాడు. సాంఘిక విలువలకు తన జీవితాన్ని లయపర్చే మణిపూస అనుకున్నాడు; ఇంకా ఏ మేమో అనుకున్నాడు కాని ఆమె అట్లాంటిది కాదు. మోసంతో లోకంలో స్థానాన్ని ఏర్పరచుకోవాలని తహతహలాడే వ్యక్తి. తన అంతస్తూ గతించిన జీవితపు ప్రమాణమూ, సంఘం కట్టబెట్టిన స్థానమూ మర్చి - అవినీతిద్వారా జీవితంలో ఆనందాన్ని బావుకుందామనుకునే నీతిలేని మనిషి. మనస్సును పరిస్థితులపరంగా మళ్ళించుకొని హృదయాన్ని అవకాశాల కనుగుణంగా, తిప్పుకొని, బ్రతుకు దెరువుకోసం - నీతిని, న్యాయాన్నీ, లక్ష్యంచేయని స్త్రీ రాజ్యలక్ష్మి. ఆమెను జీవితంలో అర్ధాంగిగా పొంది - జీవితాన్ని మధురతరం చేసికుందా మనుకున్నాడు. ఎటువంటి దురాలోచన ? ఏం చేస్తాడు ? మోసగింపబడ్డాడు. ఆమె నవ్వే ప్రతి నవ్వు వెనుకా సముద్రపు కెరటాల సౌందర్యం తొణికిసలాడుతుందనీ, ఆమె చూచే ప్రతిచూపు వెనుకా అంతులేని అనురాగం ఉట్టిపడుతుందనీ, ఆమె మాట్లాడే ప్రతిమాటలో ఎంతో వాస్తవమూ, న్యాయమూ, నీతీ పెనవేసికొనివున్నాయనీ, ఆమె మనస్సు వెన్నపూస మెత్తదనాన్ని కలిగి

వున్నదనీ, ఆమె హృదయం హిమగిరి శిఖరం లాంటిదనీ, ఆమె అనుభవాలు కాచి వడబోసిన సత్యాలనీ తను నమ్మాడు. కాని నిలకడమీద నైనా నిజం బయటపడింది. తక్షణం ఆమెను తన బ్రతుకుచూసుకో మనటమే – తన కర్తవ్యం. ఆమె జీవితం ఎంత క్రిందకు దిగజారినా, ఆమె బ్రతుకు ఎన్ని కష్టాల్లో యిరుక్కున్నా, ఆమెకు ఈ లోకంలో ఎట్లాంటి గతి పట్టినా తనకు అక్కర్లేదు! ఆమెకూ తనకూ ఏం సంబంధం? రైల్లో ప్రయాణీకులు–పెట్టెలో ఉన్నంతసేపూ కులాసాగా కాలక్షేపం జేస్తారు. ఆమెతో తనో, తనతో ఆమో ఇంకా ఆ పెట్టెలోనే ప్రయాణం చేసి గమ్యస్థానం జేరుకోవాలనుకున్నాడు. కాని ఆమె గమ్యస్థానం త్వరలోనే వొచ్చింది. పెట్టెలోంచి దిగిపోతుంది; తను పెట్టెలో ప్రయాణిస్తాడు ఒంటరిగా. అంతే తమ సంబంధం! ఆమె బాపినీడుతో సంబంధం పెట్టుకుంటే తనకేం, ఇంకా ఎవరితో సంబంధం పెట్టుకుంటే తనకేం? ఆమె బ్రతుకూ, బుద్ధీ, జీవిత పంథా – తెలిసి వొచ్చింది తనకు. తను జాగ్రత్త పడటం మంచిది. ఆమె జీవితం తాలూకు చెడు, బ్రతుకులో అపనీతి, అపఖ్యాతి– తన జీవితంమీద ఎట్లాంటి ప్రభావమూ చూపకముందే మేల్కోవటం మంచిది! ఆమెకోసం తను బాధపడటం, ఆమె బ్రతుకు అట్లా అన్యాయంగా పాడైపోతుందేనని తను ఆవేదన పడటం – అవివేకం; ఆమె మీద తనకు అధికారంలేదు; ఆమె జీవితానికి తను హామీకాదు; ఆమె బ్రతుకులోని మంచీ–చెడులకు తను గీటురాయి కాదు. దేశంలో ఎంతమంది ఆడవాళ్ళు జీవనాధారం లేకనో, వయస్సు పెట్టే గిలిగింతలకు

తట్టుకోలేకనో, మగవాళ్ళ ప్రలాపాలకు మోసపోయో, అవినీతితో కూడుకున్న జీవితంలో అమరానందం ఉన్నదని విశ్వసించో - లేచిపోవడంలేదు? బ్రతుకుల్ని పాడుచేసుకోవడం లేదు? అపఖ్యాతిపాలు గావడంలేదు? రాజ్యలక్ష్మి అంతే! ఆమె భూతభవిష్యద్వర్తమానాలతో తనకు ఏలాంటి సంబంధమూ లేదు. ఈ గ్రామంలో తన పరువు నిలబడాలంటే, తన జీవనాధారం క్షేమంగా వుండాలంటే, తనకు సాంఘిక గౌరవం వుండాలంటే - రేపు ఉదయమే రాజ్యలక్ష్మిని ఇంటినుంచి బయటికి పంపించాలి. 'నీ పాట్లు నువ్వు పడు పొట్టకూటికి అని నిష్కర్షగా చెప్పివేయాలి. అంతకంటె శ్రేయస్కరమైన మార్గంలేదు. ఆమె కన్నీరు జల్లు కురిపించి, కాళ్లమీదపడి క్షమించమని క్షోభపెట్టినా-కించిత్తుగూడా కరుణ చూపరాదు. బెదరించినా పట్టు జారవిడువరాదు.'

ఆ తెల్లవారుఝామున ప్రైవేటు మాష్టరు సూర్యనారాయణమూర్తి ఆ విధంగా దృఢంగా ఒక నిశ్చయానికి వొచ్చాడు. ఆపైన రెండు గంటలసేపు నిశ్చింతగా నిద్రించాడు.

సూర్యోదయం కాకముందే లేచాడు సూర్యనారాయణమూర్తి. కాలకృత్యాలు ముగించుకొని భగవద్గీత తెరిచాడు. నిత్యమూ అరగంటసేపు గీతాపారాయణం చేయటం అతనికి ఆ మధ్యనే అలవాటైంది. గీతాపారాయణం ముగించాక గానీ రాజ్యలక్ష్మి విషయం మనస్సులోకి రాలేదు. ఆమెతో నిర్మోహమాటంగా 'తమకు ఇక్కడ స్థానంలేదు. తమరు వెంటనే ఇక్కడనుంచి వెళ్లితే - ఇద్దరి మర్యాదలూ

కాపాడబడతాయి' అని ఆమెతో చెప్పేందు కుద్యుక్తుడై కూర్చున్నవాడల్లా లేచాడు.

అదే సమయంలో గుమ్మంలో ఆమె అడుగు పెట్టింది. ఆమె ముఖం చూడలేకపోయాడు సూర్యనారాయణమూర్తి.

"ఒకందుకు మీరు నన్ను క్షమించాలి" అన్నది ఎంతో భక్తినీ, వినయాన్నీ కనబరుస్తూ. ఆ మాటల్లో సన్స్పెన్సుకు మాష్టరుగారి హృదయం రెపరెప లాడింది. ఆమెను ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరాదని గాఢాతిగాఢంగా నిర్ణయించు కున్నాడు. కాని తీరా ఆమె అట్లా అడిగేటప్పటికి ఏమో అయినాడు.

"మీరు నన్నెంతో ఆదరించి-నాకు గౌరవప్రదమైన జీవనాధారాన్ని కల్పించి నాకు నేనుగా బ్రతుకగల్గే సమర్థతను చేకూర్చారు. అందుకు తమకు ఎలా కృతజ్ఞత తెల్పాలో అర్థం కావడంలేదు. కాని జీవితంలో మీ ఋణాన్ని తీర్చు కుంటాను. తమవద్ద సెలవు తీసికోవాలని వొచ్చాను. నాకు నేనుగా ఈ గ్రామంలో బ్రతుకగలిగే శక్తి వొచ్చింది. బాపి నీడుగారు సహాయం చేస్తామంటున్నారు. వేరే ప్రైవేటు స్కూలు పెట్టుకొని పదిమంది పిల్లలకు చదువు చెప్పుకుంటూ స్వతంత్రంగా బ్రతుకుదామని...తమ రేమంటారు?" అన్నది రాజ్యలక్ష్మి సందిగ్ధంగా.

సూర్యనారాయణమూర్తికి చెంపమీద ఛెళ్లున కొట్టి నట్లయింది. 'తను ఇట్లా ఊహించలేదు. ఇట్లా జరుగుతుందని

కలలో కూడా అనుకోలేదు. తనే నిర్దాక్షిణ్యంగా వెళ్ళగొడ తాడని – ఆమె తన తప్పు తెలిసికొని, కన్నీరు కార్చి, పశ్చా త్తాప పడుతుందనీ, తనకి ఆత్మసంతృప్తి...సూర్యనారాయణ మూర్తి ముఖం నల్లగా కావురేసుకుపోయింది. కృతజ్ఞతట కృతజ్ఞత? కృతఘ్నత చూపింది చాలదూ! ఈ గ్రామంలో బ్రతుకగలిగే శక్తి వొచ్చిందా? ఎట్లా? ఏవిధంగా?... ప్రైవేటు స్కూలు తనకు పోటీగా పెడుతుందన్నమాట! 'స్వతంత్రంగా బ్రతుకుదామని' – తన దగ్గర అస్వతంత్రంగా, బానిసగా బ్రతికిందా? ఛి ఛీ! ఉపకారాన్ని గుర్తించేకాలం కాదు. రేపు బాపినీడు స్వతంత్రంగా బ్రతకనిస్తాడా? అతని సంగతి తెలియదు. తన కెందుకు ఆమె ఎట్లా పోతే? ఆమె జీవితం ఏమైనా తనకు చింత లేదు. తన ఋణం తీర్చుకుంటుం దట. ఎట్లా?' ఆమె సమాధానంకోసం వేచివుండడం చూసి–సూర్యనారాయణమూర్తి వెంటనే అంగీకారాన్ని తెలిపాడు.

"నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు ముక్తసరిగా.

రాజ్యలక్ష్మి నమస్కరించి వెళ్ళిపోయింది. అతను ఆలోచిస్తూ కూర్చుండి పోయాడు.

## 4

ఆ గ్రామానికి చెన్నకేశవస్వామివారి రథశాల నడి బొడ్డు. ఆ రథశాలకు దక్షిణపు వీథిలో – పంచాయితీబోర్డు వైస్‌ప్రసిడెంటు బాపినీడు పెదనాన్నగారి పూరికొంప వుంటే

దాన్ని బాగుచేయించాడు. అందులో రాజ్యలక్ష్మి ఉండే ఏర్పాటు చేశాడు.

ఏ రకంగానైతేనేం శాస్త్ర పేరుగల వ్యక్తి బాపినీడు. ఆ ఊళ్లో అతన్ని చూసి గౌరవించేవాళ్లూ ఉన్నారు; భయపడేవాళ్ళూ ఉన్నారు; పొగిడేవాళ్ళూ ఉన్నారు; తెగిడే వాళ్ళూ ఉన్నారు; చెప్పినమాట వినేవాళ్లూ ఉన్నారు. అతను పచ్చిరాడీ అని కొంతమంది అనుకుంటారు. మరి కొంతమంది అతను మంచివాడేగానీ అతనిచుట్టూ వున్న గ్రహాలు చెడ్డవి అంటారు. ఇంకొంతమంది అతను డబ్బుగల గర్వపోతని అంటారు. పంచాయితీబోర్డు ప్రెసిడెంటుకుసహితం బాపినీడును చూస్తే భయం. బాపినీడు తరఫున ఇద్దరు మెంబర్లు ఉన్నారు. అతన్ని ఎదిరిస్తే - పంచాయితీబోర్డు పరిపాలన సాగదు. ఎదురుపార్టీ వెంకయ్యముఠా తలలు ఎత్తుకుతిరుగుతారు. అందువల్ల ప్రెసిడెంటు బాపినీడు చెప్పింది కాదనడు.

రాజ్యలక్ష్మి ప్రైవేటుస్కూల్లో వారం రోజుల్లోనే-సూర్యనారాయణమూర్తి స్కూల్లో పిల్లలు పదిహేనుమంది చేరారు. అదంతా బాపినీడు ప్రోద్బలంవల్లనే! పంచాయితీ బోర్డు ప్రెసిడెంటూ, నలుగురు మెంబర్లూ తీవ్రంగా జోక్యం కలిగించుకోవాల్సి వచ్చింది. పిల్లల తల్లిదండ్రులకు వాళ్లు 'రాజ్యలక్ష్మి ప్రైవేటుస్కూలుకు పిల్లల్ని పంపిచాల్సిందని వొత్తిడిపెట్టారు'. అంతా వొక తెగవాళ్ళు గనుక, ఇష్టంలేక పోయినా దశరథరామయ్య, పుల్లయ్యగారి నల్లయ్య, రామ

కోటయ్య, భూషయ్యగారి బుచ్చిరామయ్య మొదలైనవాళ్ళు తమ పిల్లల్ని విధిగా పంపించారు.

బాపినీడు వ్యవహారాన్ని ఆ ఊళ్లో చాలమంది యేవగించుకున్నారు. అతను తన స్వార్థంకోసం పంచాయితీబోర్డు అధికారాన్నీ, కులపు ఆధిక్యతనూ, పార్టీప్రచారాన్నీ వినియోగించుకోవటం చాలామంది పిన్నలకూ, పెద్దలకూ కష్టం కలిగింది. 'ఉంపుడుగత్తె రాజ్యలక్ష్మికోసం అతను పిల్లల్ని బళ్ళోకి పంపమంటే పంపట మేమిటని' యువకులు రోషం తెచ్చుకున్నారు. కాని ఏం లాభం? ఏనుగు పోతూంటే కుక్కలు అరిచినట్టుగానే వుంటుంది, వాళ్లు రోషం తెచ్చుకుంటె.

తన స్కూల్లోంచి పదిహేనుమంది పిల్లలుపోతే–సూర్యనారాయణమూర్తికి ఏమీ విచారం కలుగలేదు. అంతా మన మంచికొరకే అనుకున్నాడు. అంతమందికీ చదువు సక్రమంగా శ్రద్ధగా చెప్పాలంటే – వాస్తవంగా అతని శక్తికి మించినపనే. అసలు అతను పిల్లల్ని ఎక్కువమందిని చేర్చుకున్నది కూడా రాజ్యలక్ష్మికోసమే!

ఒకరోజు సాయంకాలం వెంకయ్య ప్రత్యేకంగా సూర్యనారాయణమూర్తిని కలుసుకున్నాడు. వెంకయ్య ఆ ఊళ్ళో పంచాయితీబోర్డు ప్రెసిడెంటుకు ఎదురు పార్టీ నాయకుడు. అతను పంచాయితీ బోర్డు మెంబరే. లోగడ పంచాయితీ బోర్డు ప్రెసిడెంటుగిరీకూడా చేశాడు. కాని ఆ మైనర్ పంచాయితీబోర్డుకు ఊళ్లో పేదప్రజ జాస్తిగా వుండటంవల్ల రెండు

చేతులా డబ్బును విరజిమ్మిన బాపినీడు పార్టీ ఎక్కటంలో ఆశ్చర్యంలేదు.

"పంతులుగారూ! మా పిల్లలు ఒక అరడజను మంది వున్నారు. తమ స్కూల్లో చేర్చుకోండి. ఎలిమెంటరీ స్కూలు మరీ రానురాను పాడుబడ్డ సత్రంలాగ తయారైంది. పంతుళ్ళూ లేరు, పిల్లలూ లేరు. మా వాళ్ళకు అక్షరం ముక్క అబ్బటానికి ..." వెంకయ్య లావుపాటి చేబ్రోలు పుగాకు చుట్టను పీలుస్తూ అన్నాడు.

"వొద్దు బాబూ! ఉన్నవాళ్ళకి శ్రద్ధగా చదువు చెప్ప గలిగితే చాలండీ" నసిగాడు ప్రైవేటు మాష్టరు.

"కాదు, మీరు తప్పకుండా జేర్చుకోవాలి" వెంకయ్య మొండి పట్టు పట్టాడు. తమ పిల్లలకు చదువు రావటానికి అంత కంటే వేరేమార్గంలేదని వెంకయ్య భావించటంలో తప్పులేదు. ఎందుకంటె - రాజ్యలక్ష్మి ప్రైవేటు స్కూలుకు పిల్లల్ని పంపించలేదు గనుక.

సూర్యనారాయణమూర్తి అంగీకరించాడు. అరడజను అనుకున్నది పదిమంది వరకూ జేరారు, కొత్తగా సూర్యనారాయణమూర్తి స్కూల్లో. ఆ విషయం పంచాయతీబోర్డు వైస్ ప్రెసిడెంటు బాపినీడుకు గుళ్ళో కోయంబత్తూర్ డౌన్ అణాల ఆట ఆడుతూంటే - పరసనల్ అసిస్టెంటు జగన్నాథం చెప్పాడు.

*

అర్ధరాత్రి దాటిందో లేదో-బయట ఎవరో తీవ్రంగా తలుపు కొడుతూంటే సూర్యనారాయణమూర్తి విసుక్కుంటూ తలుపు తెరిచాడు.

ఎదురూగ్గా ముగ్గురు వ్యక్తులు భీకరాకారాలతో, కళ్ళు నులుముకొని చూశాడు 'కలా!' 'నిజమా!' తేల్చుకోటానికి.

ఇద్దరు బుర్రమీసాలవాళ్ళు, ముగ్గురూ తల గుడ్డలు చుట్టారు. చేతిలో లావుపాటి పన్నుగర్రలు. దొంగలా? దొమ్మీకివొచ్చారా? వొణికిపోయాడు అన్నెమూ పున్నెమూ ఎరుగని పంతులు. నోటమాటరాలేదు. శరీరం వణుకులో వశం తప్పింది. ముగ్గురూ వడిగా లోపల జొరబడ్డారు - కర్రలు మోతచేసుకొంటూ. దొంగలైందీ, దొమ్మీవాళ్లయిందీ తెలుసుకోలేకపోయాడు. వాళ్ల ముగ్గుర్నీ ఎరుగడు.

"ఏయ్! పంతులూ! మేం ఎవరమో తెల్సా?" అన్నాడు బుర్రమీసం మీదకు చేయి వెళ్లనిచ్చి ఆ ముగ్గుర్లో పొట్టివాడు.

తెలీదన్నట్టు అమాయికంగా తల ఆడించాడు సూర్యనారాయణమూర్తి.

"తెలుపుడు చేయమంటావా?" అన్నాడు ఇంకొక బుర్రమీసం.

'అంటే!' అన్నట్టు ఆశ్చర్యంగా ముఖం తేలవేశాడు ప్రైవేటు మాష్టరు.

"ఏయ్ పంతులూ! మేం తల్చుకుంటే నువ్వు కాలికింద చీమవి. తెలుసా? జాగ్రత్త! వేషాలు వేస్తున్నావంట. ఎముకలు సున్నంలోకి మిగలకుండా మెత్తగా మాలిష్ పడతాం" అన్నాడు మూడోవాడు లాఠీ కర్రని నేలమీద కొడుతూ.

సూర్యనారాయణమూర్తికి వాళ్ళ దౌర్జన్యము అర్థం కాలేదు. ఎంతో ధైర్యాన్ని కూడగట్టుకొని 'మీరెందుకొచ్చారు?' అన్నాడు పేలవంగా.

"నీకు బుద్ధి చెప్పటానికి!"

"నాకా?"

"ఆఁ!... తెల్లవారేపాటికి నువ్వు ఈ ఊళ్లోవుంటే–రేపు తెల్లవారేపాటికి నువ్వు నరకలోకానికి నేరుగా పోతావు. అర్థమైందా?" బుర్ర మీసం వికటాట్టహాసం చేసింది.

సూర్యనారాయణమూర్తికి పై ప్రాణాలు పైనే పోయినయ్.

"తట్టా బుట్టా సర్దుకుని ఏదైనా ఊరెళ్ళి బ్రతుకు. ఇక్కడ నీ ఆటలు సాగవు. రాజ్యలక్ష్మికి పోటీగా పాఠశాల నడుపుతావా? వెంకయ్య ముఠాలోని పిల్లల్ని స్కూల్లో జేర్చుకుంటావా? ఎన్ని గుండెలు? ఎంత పొగరు? బ్రతుకు మీద ఆశ వొదులు కుంటావో, బ్రతుకుదెరువే చూసుకుంటావో చెప్పు. ఊఁ! ఈ ఊళ్ళోనుంచి వెళతావా? లేదా?" గొంతు పుచ్చుకున్నాడు గట్టిగా.

సూర్యనారాయణమూర్తి పిచ్చికలా వొణికిపోయాడు. రెండు చేతులూ యెత్తి నమస్కారం చేశాడు.

"నన్ను వదలండి బాబూ! దిక్కుమాలిన వాడ్ని. నా బ్రతుకు నేను బ్రతుకుతా ఏదైనా ఊరుపోయి. నన్ను వొదలండి బాబూ" వేడుకున్నాడు ఏడ్పువచ్చే కంఠంతో.

"పిరికి పంతులు" పెద్దగా వెర్రినవ్వులు నవ్వుకుని, కర్రలు మోగించుకుంటూ వెళ్ళిపోయారు. పంచాయితీబోర్డు వైస్ ప్రెసిడెంటు బాపినీడు తాలూకు మనుష్యులు.

ప్రైవేటు మాష్టరు సూర్యనారాయణమూర్తి అరి చేతుల్లో ముఖం కప్పుకొని - అరగంటసేపు ఆలోచించాడు పరిస్థితుల పరిణామానికి. తర్వాత మెల్లగా లేచి సామాను సర్దాడు తెల్లవారేవరకూ.

సూర్యనారాయణమూర్తి ఆ ఊరినుంచి ప్రక్కఊళ్లోకి వెళ్ళటం చాలమందికి ఆశ్చర్యము వేసింది. అందరూ కారణం అడిగేవాళ్ళే. కాని రాత్రి సంఘటన ఎవ్వరితోనూ చెప్ప లేదు. "ఏముంది బాబూ! ఈ ఊరికీ నాకూ నేటితో ఋణం తీరింది. వెళుతున్నాను" అన్నాడు ఒకళ్ళిద్దరితో. ప్రక్క ఊళ్ళో ఒక హైస్కూలు మాష్టరు చిన్ననాటి స్నేహితుడు వుంటే - అక్కడకు ప్రయాణం కట్టాడు. ఆ ఊరు ఎంతో దూరం లేదు - రెండే రెండు మైళ్ళు.

వీరాస్వామి ఒంటెద్దు బండిలో సామానుతోపాటు పంతులుగారు సూర్యోదయం కాగానే వెళుతూంటే - కిళ్ళీ

బడ్డీ దగ్గరవున్న బాపినీడు విజయగర్వంతో చిరునవ్వునవ్వగా తల దించేసుకున్నాడు ప్రైవేటు మాష్టరు సూర్యనారాయణమూర్తి.

సూర్యనారాయణమూర్తి స్కూలు మూసి వేయటంతో - ఎక్కువమంది పిల్లలు రాజ్యలక్ష్మి స్కూల్లో చేరారు. కొంతమందిమటుకు ఎలిమెంటరీస్కూల్లో చేరారు. అంటే వెంకయ్య మూశా తాలూకు వాళ్ళు.

## 5

'నోరు మంచిదైతే ఊరు మంచిదేరా నరుడా!' అన్నట్టు ఎప్పుడోగాని సహృదయులకూ, సుబుద్ధివాళ్ళకూ, సత్ప్రవర్తన గల వాళ్ళకూ ఏ ఊళ్ళోనైనా స్థానం లభించకుండా పోదు. నాలుగు మాసాల్లోనే సూర్యనారాయణమూర్తి ఆ ప్రక్క గ్రామంలో స్థానం నిలవదొక్కుకోగల్గాడు. స్నేహితుని సహాయంతో ప్రైవేటు మాష్టరుగా పేరులోకి వొస్తున్నాడు. ఇరవై అయిదుమంది వరకూ స్కూల్లో పిల్లలు చేరారు.

అతని మంచితనమూ, చదువు చెప్పడంలో నేర్పూ, శ్రద్ధా ఆ ఊళ్ళో వాళ్లందరికీ తెలియవచ్చింది ఆ నాలుగు మాసాల్లోనే.

రాజ్యలక్ష్మి ఏమైందో, ఆమె బ్రతుకు ఏ స్థితికి వొచ్చిందో, ఎట్లా జీవిస్తోందో - రెండుమైళ్ల దూరంలో వుండీ

కూడా సూర్యనారాణమూర్తి తెలిసికోలేదు. ఆమెను దాదాపు మరిచిపోయేస్థితిలో ఉన్నాడు.

ఆ రోజు ఉదయం బకింగ్‌హామ్ కెనాల్లో స్నానంచేసి, సూర్యనమస్కారం ముగించి - వొడ్డుకు వొచ్చేప్పటికి— "పంతులుగారూ!" అన్న కేక వినిపించింది. పరిచయంవున్న కంఠంలాగ గోచరించి వెనుదిరిగి చూచాడు.

తాను ప్రైవేటు స్కూలుపెట్టి, భయపడి పారిపోయి వచ్చిన ఊరితాలూకు వ్యక్తి రామసుబ్బయ్య! ఏదో పని మీద ఆ ఊరు వొస్తున్నట్టున్నాడు.

"బావున్నారా, పంతులుగారూ! మీకు జరిగిన అన్యాయానికి మీకు ముఖం చూపించలేకుండా ఉన్నాం" రామసుబ్బయ్య కొడుక్కి కూడా సూర్యనారాయణమూర్తి రాజ్యలక్ష్మి విడిపోయేవరకూ చదువు చెప్పాడు.

"ఏమిటి విశేషాలు ?"

"అయ్యో? మీ కింకా తెలీలేదా? ఇవాళ ఉదయమే - రాజ్యలక్ష్మి రైలుక్రిందపడి చనిపోయింది. ఊళ్లో జనమంతా వెళ్ళి చూచివొస్తున్నారు. ఆత్మహత్య చేసికుంది" అన్నాడు రామసుబ్బయ్య.

సూర్యనారాయణమూర్తి గుండె ఆ వార్త వినగానే - క్షణంసేపు పనిచేయడం మానివేసింది! కళ్ళల్లో నీళ్ళు నెట్టుకొచ్చినయ్.

"బాపినీడును నమ్ముకొని బ్రతుకుదామనుకుంది. కాని చివరకు ఆ బ్రతుకు బుగ్గిఅయింది...వస్తాను పంతులుగారూ! ఊళ్ళో అర్జంటుపనివుంది" అంటూ వెళ్ళాడు రామసుబ్బయ్య.

నిశ్చేష్టుడై అట్లాగే కాలువవొడ్డున అయిదు నిము షాలు నిలుచుండిపోయాడుసూర్యనారాయణమూర్తి. 'పాపం! చివరికి ఆమె జీవితం ఎట్లా అయింది? ఆత్మహత్య చేసికొనే అగత్యం ఏర్పడేందుకు - పరిస్థితులు ఎంత విషమంగా పరిణ మించాయో! ఆమె ఆత్మహత్యకు తనే కారణం? తన స్వార్థాన్నీ, తన బ్రతుకుబాగునీ, సంఘంలో తన జీవితపు సంక్షేమాన్ని తను చూసుకున్నాడు. ఆమె బ్రతుకు అంత దారుణంగా తెల్లవారటానికి తనూ ముఖ్యకారణం! ఆరోజు సాయంత్రం - ఆమెను తను ఆ ఊళ్లోకి ఆహ్వానించకపోతే, జీవనాధారాన్ని కల్పించియుండకపోతే - ఆమె జీవితం ఇట్లా ముగిసేదా? తను పిరికివాడు; స్వార్థపరుడు; దుర్మార్గుడు. బాపినీడు సంగతి తనకు తెలుసు; ఆ గ్రామంలోని రాజ కీయాలు తనకు తెలుసు; ఆమె బాపినీడునునమ్మి, ఏదో సుఖం బావుకుందామని గుడ్డిగా, అజ్ఞానంగా, అవివేకంగా తప్పుడుదారి త్రొక్కుతూంటే - తను ఆమెను సన్మార్గం లోకి మళ్ళించాడా? బాపినీడు ప్రవర్తనలోని నైజాన్ని వివ రించి చెప్పాడా? రాబోవు పరిస్థితుల్ని ఊహించి, విస్తరించి ఆమెకు బోధించాడా? తాను స్వార్థంగా ప్రవర్తించాడు; ధర్మాన్ని నిర్వర్తింపలేదు. ఆమె తనని ప్రేమించలేదనీ, తన ఊహాల్ని ఆశల్ని - అర్థం లేనివిగా, నిరాశలుగా మార్చిందనీ,

అక్కడున్న కొద్దీ - ఆమె కర్మకు ఆమెను వొదిలేశాడు. ఆమె అవినీతిలోకి దూకుతుంటే సంతృప్తిపడ్డాడు; అజ్ఞాతంగా ఆమె మీద పగదీర్చుకొన్నాడు. ఆమెమీద తనకు బాధ్యతలేదా? అధికారం లేదా? ఆమె తన మాట లక్ష్యపెట్టేది కాదా? ఆమెను తను అర్థంచేసుకున్నాడా?' సూర్యనారాయణమూర్తి ఆ విధంగా బాధపడ జొచ్చాడు.

పది గంటలకు టపాలో సూర్యనారాయణమూర్తి కొక కవరు వొచ్చింది. దానిపై దస్తూరీ చూడగానే అతని హృదయం వొణికింది. రాజ్యలక్ష్మి వ్రాసింది.

"... ఈ లేఖ మీ చేతుల్లోకి వొచ్చేటప్పటికి నన్ను గురించి మీరు ఆలోచిస్తూనే వుంటారు. 'ఆమె జీవితం ఇట్లా ముగిసిందేమిటి!' అని మీరు బాధపడతారని నాకు తెలుసు. కాని నా జీవిత పరిణామానికి ఎవరు కర్తలు? నాకు నేనే, పూర్వ జన్మలో నేను చేసికున్న పాపమూ! నా బ్రతుకులో వెలుగు కన్పించాలనీ, నా జీవితాన్ని పవిత్రం చేయాలనీ, నాకు గౌరవప్రదమైన ఉద్యోగాన్నే మీరు ఇచ్చారు. కాని నా ఆత్మ నన్ను మోసం చేసింది. నన్ను నేను మోసం చేసికొనే శక్తి నిచ్చింది. నా బ్రతుకు నేను బ్రతకగలననే విశ్వాసాన్ని దృఢపర్చింది. బాపినీడుగారి మాటల్ని నమ్మాను. అతని మాటల్లోని తియ్యందనాన్నీ, ముఖంలోని ఆకర్షణనూ, ఆస్తినీ, అనురాగాన్నీ - నమ్మాను. అతనికి నా శరీరంమీద పూర్తి అధికారం యిచ్చి, జీవితంలో ఆనందాన్నంతా చవి చూద్దామనే తలంపుతో, అవినీతినీ, సంఘంలో నా స్థాయినీ

ఆలోచింపక - అతనికి ఉంపుడు గత్తెగా తయారైనాను. కాని అయిదు మాసాలు గడవకముందే - నా బ్రతుకు నాకు తెలిసి వొచ్చింది. బాపినీడు దుర్మార్గం బయటపడింది. నాకు గర్భం వొచ్చిందని తెలిసికొని కలుగబోయే సంతానానికి తాను తండ్రి అవుతాడని భయపడి - రౌడీల చేత ఒక అర్ధరాత్రి నన్ను భయపెట్టించాడు. 'ఈ ఊరు వొదిలి వెళ్ళకపోతే చంపుతామని' వాళ్లు బెదిరించారు. బాపినీడు నా ఇంటికి రావటం బొత్తిగా మానివేశాడు. బళ్ళో పిల్లల సంఖ్య రోజు రోజుకూ తగ్గిపోతున్నది. ఇక ముందు ఈ ఊళ్ళో నా బ్రతుకు బజారుపాలేనని గ్రహించాను. అప్పుడు గత చరిత్రను స్ఫురణకు తెచ్చుకున్నాను. భవిష్యత్తును ఊహించుకున్నాను. నీతి చెడిన స్త్రీకి ఎట్లాంటి భవిష్యత్తు ఉన్నదో యీ దేశంలో అందరికీ తెలిసిందే! ... ఆత్మహత్యే అన్నింటినీ మించిన ఉత్తమమైన మార్గమని నిశ్చయించుకున్నాను. కాని మీా ఋణం ఈ జీవితంలో తీర్చుకోలేనందుకు - క్షమించండి!

—రాజ్యలక్ష్మి.

★